క్లుప్తంగా

వైభవంగా పడిపూజ


దుర్గసముద్రంలో స్వామికి చేస్తున్న పడిపూజ

తిరుపతి రూరల్: మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా దుర్గసముద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం పడిపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. తొలుత అభిషేక కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మిట్టపల్లి ప్రసాదరెడ్డి, ఆలయ కమిటీ పెద్దలు సిద్ధారెడ్డి, నాగిరెడ్డి, బాలసుబ్రమణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా గాలిపటాల సంబరాలు


గాలిపటాల సంబరాల్లో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు

తిరుపతి కల్చరల్: మకర సంక్రాంతి పండుగ సందర్భంగా గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ మంగళవారం గాలిపటాల సంబరాలను ఘనంగా నిర్వహించింది. రంగు రంగులతో వివిధ ఆకర్షణీయమైన గాలిపటాలను ఎగురవేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ రీజినల్ కౌన్సిల్ సభ్యుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ గౌరవ చైర్మన్ డాక్టర్ పీసీ.రాయులు మాట్లాడారు. పండుగ నాడు సామూహికంగా గాలిపటాలు ఎగురవేస్తూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బంగారు బాబు, శంకర్, ఎస్‌కే.బాబు, రఘురాంరెడ్డి, జయరామయ్య ,చక్రపాణి, పోతప్ప, భారతి, కృష్ణమూర్తి, గోపి, శివన్న, సభ్యులు పాల్గొన్నారు.

విరూపాక్షమ్మకు పట్టువస్త్రాల సమర్పణ


విరూపాక్షమ్మకు పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు

రామచంద్రాపురం: మండలంలోని కమ్మకండ్రిగ గ్రామదేవత విరూపాక్షమ్మకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు బుధవారం పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో పుర ఉత్సవం



శ్రీకాళహస్తి : జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి పుర ఉత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. అంతకు ముందు గిరి ప్రదక్షిణలో భాగంగా స్వామి అమ్మవార్లకు ఎదురుసేవ మండపం వద్ద కొలువుదీర్చారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. వేద మంత్రాలు , మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠించి. పురవీధుల్లో ఊరేగారు.

రంకెలేస్తున్న కోడెగిత్త



జనాల్లోకి దూసుకెళ్తున్న కోడెగిత్త



రంకెలేసిన కోడెగిత్తలు

- వివిధ మండలాల్లో కనుమ పండుగ జోరు
- పరుష పందేల్లో ఉత్సాహంగా పాల్గొన్న యువత

రామచంద్రాపురం: మండలంలోని బొప్పరాజుపల్లె బుధవారం కనుమ పండుగ సంబరాలతో జన సంద్రమైంది. గ్రామంలో ఎడ్ల పందేలు కోలాహలంగా నిర్వహించారు. పశువులకు కొమ్ములను చెక్కి, రంగులు వేసి, చెక్కలతో తయారు చేసిన పలకలను అలంకరించారు. కొందరు తమకు నచ్చిన నాయకులు, వివిధ దేవుళ్లను బొమ్మలను పలకలకు అతికించారు. అనంతరం దొడ్ల నుంచి పశువులను వదిలారు. గ్రామ యువకులు పశువుల ముందు దారి చూపుతూ పరిగెత్తుతుంటే పశువుల వెనుక డప్పులతో చప్పుడు చేస్తూ బెదరగొట్టారు. పరుగులు తీస్తున్న కోడెగిత్తల నుంచి పలకలు, కొమ్ములకు కట్టిన బహుమతులను దక్కించునేందుకు యువకులు పోటీ పడ్డారు. అనంతరం గ్రామస్తులు అన్నదానం చేశారు.

పాకాల మండలంలో..

పాకాల: మండలంలోని గానుగపెంట పంచాయతీ, కూనపల్లె, కె.వడ్డేపల్లె పంచాయతీ పోలిరెడ్డిపల్లెలో పరుష పందాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆయా గ్రామాలలో గ్రామ దేవతలకు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని ఎద్దులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన ఎద్దులను సుందరంగా అలంకరించారు. ఎద్దుల కొమ్ములకు రంగు రంగుల పలకలు కట్టి బరిలోకి దింపి పరుగులు తీయించారు. ఆ పలకలను, వాటికి కట్టిన బహుమతులను చేజిక్కించుకునేందుకు యువకులు రెట్టించిన ఉత్సాహంతో వాటి వెంట పరుగులు తీశారు. తమ అభిమాన నాయకులు చిత్రాలతో ఎద్దులకు కట్టిన పలకలు ఆకర్షణగా నిలిచాయి. పరుష పందాలను తిలకించేందుకు స్థానికులతో పాటు చుట్టపక్కల గ్రామాల ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చారు.


పాకాల: ఎద్దులను తరుముతున్న యువకులు


పాకాల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంతో కూడిన పలకలను చూపుతున్న అభిమానులు

చిన్నగొట్టిగల్లు మండలంలో..

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండల వ్యాప్తంగా బుధవారం ప్రజలు భక్తి శ్రద్ధలతో పశువుల పండుగను నిర్వహించారు. పశువులను శుభ్రంగా కడిగి, ప్రత్యేకంగా అలంకరించి, నల్లదారాలు, మువ్వలు, గజ్జలు, గంటలు, బెలూన్లు, పూల హారాలతో అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం పశువుల దేవర వద్దకు తీసుకెళ్లి పశువులను డప్పుల మోత నడుమ పరుగులు తీయించారు. అనంతరం పశువుల దేవర వద్ద ఏర్పాటు చేసిన చిట్లాకుప్పలకు నిప్పు పెట్టారు. అక్కడ వండిన ప్రసాదాన్ని పశువులకు పెట్టి, ప్రత్యేకంగా కాటమరాజు పూజలు చేశారు. మారసానివారిపల్లెలో జగనన్న ప్రభలతో పశువులు ఊరేగించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, స్థానిక సర్పంచ్ సింహాల విమల తదితరులు పాల్గొన్నారు.


భాకరాపేట: మారసానివారిపల్లెలో..


జనసంద్రమైన గ్రామం

జర్నలిస్టుల పాసులపై అవగాహన లేని కండక్టర్లు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ అధికారులు జర్నలిస్టులకు మంజూరు చేస్తున్న బస్ పాసులపై కొందరు కండక్టర్లకు ఇప్పటికీ పూర్తి అవగాహన లేకపోవడంతో పాత్రికేయులు ప్రయాణ సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. బుధవారం సాయంత్రం తిరుపతి నుంచి శ్రీకాళహస్తి డిపోకు చెందిన ఏపీ 39 జడ్ 0261 నంబర్ గల ఆర్టీసీ బస్సులో ఓ పాత్రికేయుడు ఎక్కాడు. రేణిగుంట వరకు అంటూ.. తన జర్నలిస్ట్ పాసును మహిళా కండక్టర్‌కు చూపించాడు. దానిని చూసిన ఆమె..ఇది చిత్తూరు జిల్లా పాస్ అని, తిరుపతి జిల్లాలో టికెట్ తీసుకోవాల్సిందేనంటూ తేల్చి చెప్పారు. ఆర్టీసీ అధికారులు ఇచ్చిన బస్సు పాస్‌లో పూర్వపు చిత్తూరు జిల్లా అని స్పష్టంగా ఉందని జర్నలిస్ట్ ఎంత చెప్పినా ఆమె పట్టించుకోలేదు. చివరికి సందేహం ఉంటే అధికారులకు ఫోన్ చేసి తెలుసుకోవాలని జర్నలిస్ట్ ఆమెకు సూచించినా.. మాకిదే పనా!? అంటూ ఆమె టికెట్ ఇవ్వబోయారు. ఇంతలో జర్నలిస్ట్ ఆర్టీసీ పీటీకు ఫోన్ చేసి సమస్యను ఆయన దృష్టి తీసుకెళ్లాడు. ఆ అధికారి సైతం స్పందించి ఫోన్లోనే ఆ మహిళా కండక్టర్‌తో మాట్లాడారు. పూర్వపు చిత్తూరు జిల్లా పాస్‌పై ఆమె అవగాహన కలిపించడంతో చివరకు ఆమె తన స్వరం మార్చారు. ఇదలా ఉంచితే, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పూర్వపు చిత్తూరు, తిరుపతి జిల్లా పాసులపై కండక్టర్లకు ఆర్టీసీ ఉన్నతాధికారులు సరైన అవగాహన కల్పించాల్సి ఉంది.

అందరికీ అండగా ఉంటా


చింతంశెట్టి మల్లికార్జున్

తిరుపతి అర్బన్: కాపు సంఘంలోని అందరికీ అండగా ఉంటామని తిరుపతి, చిత్తూరు జిల్లాల జాతీయ కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతంశెట్టి మల్లికార్జున్ బుధవారం తెలిపారు. జాతీయ కాపు సంఘం వ్యవస్థాపకులు, అధ్యక్షులు కర్ణ మురళీకృష్ణ నాయుడు తననీ పదవిలో నియమిస్తూ పత్రం జారీ చేశారని, తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాపు సంఘం ఆధ్వర్యంలో పేదల ఆరోగ్యం, విద్యకు సంబంధించి సాయం చేయడానికి ముందుంటామని చెప్పారు. అలాగే కాపు సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

తిరుపతి కల్చరల్: టీటీడీ పరిపాలన భవనం ప్రాంగణం ఆవరణలోని మైదానంలో బుధవారం రాత్రి కన్నుల పండువగా గోదా కల్యాణం నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణస్వామి, శ్రీఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలకరించి అర్చక స్వాములు కల్యాణ వేదికపై వేంచేపు చేశారు. తొలుత ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తలను సుమధురంగా గానం చేసి ఓలలాడించారు. అనంతరం తిరుమల శ్రీవారి ఆలయ అర్చకులు శ్రీవిష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణం, రక్షాబంధనం, అగ్నిప్రతిష్ఠ, ఆ తర్వాత మహా సంకల్పం, స్వామి అమ్మవార్ల ప్రవరలు, మాంగల్య పూజ, మాంగల్యధారణ, ప్రధాన హోమం, లాజ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. మాలా పరివర్తనం, అక్షతారోపణం జరిపి చివరిగా నివేదన, మంగళ హారతులు నిర్వహించారు. మంగళవాయిద్యాల హోరు, అర్చకుల మంత్రోచ్చరణల మధ్య భక్తజనం గోవింద నామ సంకీర్తనలతో గోదా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్, జేఈఓ వీరబ్రహ్మం దంపతులు, తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల్ దీక్షితులు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపల్ ఉమా ముద్దుబాల, భక్తులు పాల్గొన్నారు.


ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థినుల నృత్య రూపకం

పితృ తర్పణం.. పోటెత్తిన జనం

తిరుపతి కల్చరల్: పెద్దలను స్మరించుకునే మకర సంక్రాంతి నాడు తమ కుటుంబ పెద్దలకు పితృ తర్పణం కార్యక్రమం నిమిత్తం వచ్చిన వారితో మంగళవారం కపిలతీర్థం పోటెత్తింది. మూడు రోజుల సంక్రాంతి పర్వదినాలలో మకర సంక్రాంతి నాడు కుటుంబ పెద్దలకు పితృ తర్పణం, పిండ ప్రదానం చేసి స్మరించుకోవడం ఆనవాయితీ. ఇలా చేస్తే వంశాభివృద్ధి, గోత్ర అభివృద్ధి జరుగుతుందని ప్రజల నమ్మకం. మంగళవారం మకర సంక్రమణ పుణ్యకాలం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు, ఈ సమయంలో పితృ తర్పణం చేసేందుకు నగర ప్రజలే కాక చుట్టుపక్కల ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులతో రావడంతో ఎటుచూసినా కపిలతీర్థం కిటకిటలాడింది. పురోహితుల పర్యవేక్షణలో పితృదేవతలకు పిండ ప్రదానం, తర్పణ దానం చేశారు.

కపిలతీర్థం వద్ద అన్నప్రసాదాల వితరణ

మకర సంక్రాంతి నాడు పూర్వీకులకు తర్పణాలు వదిలేందుకు కపిలతీర్థం వద్దకు వచ్చిన వారికి మంగళవారం బీజేపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుండాల గోపినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాదాల వితరణ చేశారు. బీజేపీ నేతలు కామోష్ బాబు, చిట్టిబాబు, రంగస్థలి ప్రతినిధులు ఆనంద్, వేణుగోపాల్, ఫణిభూషణరెడ్డి పాల్గొన్నారు.



ప్రణయ కలహోత్సవం


ప్రణయ కలహోత్సవంలో వేదపండితుల మంత్రోచ్చరణ

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం సాయంత్రం ప్రణయ కలహోత్సవం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు శ్రీ మలయప్పస్వామి పల్లకి అధిరోహించి మహాప్రదక్షిణ మార్గంలో స్వామి పుష్కరిణి వద్దకు వచ్చారు. అమ్మవార్లు చెరో పల్లకిపై అప్రదక్షిణంగా స్వామివారికి నిలుచున్నారు. అమ్మవార్ల తరపున జియ్యంగార్లు పూలచెండ్లను స్వామివారిపై మూడుసార్లు విసరడం, స్వామివారు బెదిరినట్లుగా అమ్మవార్లను ప్రాధేయపడటం,ఆపై అమ్మవార్లు శాంతించి స్వామివారికి ఇరువైపులా చేరి కర్పూర నీరాజనాలు అందుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆ తరువాత ఆస్థానం నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, తిరుమల చిన్నజీయర్ స్వామి, టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రథోత్సవం



చంద్రగిరి: స్థానిక గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ దేవి ఆలయంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం అమ్మవారు రథంపై ఆశీనులపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం సాయంత్రం భూత వాహనంపై అమ్మవారి మహిషాసురమర్ధిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం సింహ వాహనంపై ఆశీనులై దుర్గ అలంకరణలో భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, ఉత్సవ ఉభయదాతలు పాల్గొన్నారు.

ఆదేశాలు సరే! ఆచరణ మాటేంటి..?

- బస్ పాస్‌ల జారీ సెంటర్ మార్పుపై మీనమేషాలు
- పాస్ తీసుకోవాలంటే నానా తంటాలు
- అదేచోట విద్యుత్ బస్సుల చార్జింగ్ పాయింట్లు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలోని ఏడుకొండల బస్టాండ్‌కు ఉత్తరం వైపు చిన్నపాటి గదిలో విద్యార్థులు, వికలాంగులు, జర్నలిస్టులు తదితర అన్నిరకాల ఆర్టీసీ బస్సు పాస్‌లను జారీ చేస్తుంటారు. అయితే ఆ బస్సు పాస్ సెంటర్‌కు ఎదురుగా ఆరు నెలల క్రితం 13 విద్యుత్ బస్సులకు చెందిన చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. నిత్యం ఆ మార్గంలో విద్యుత్ బస్సుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీంతో ఆ మార్గంలో వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. దీనికితోడు బస్సుపాస్‌ల జారీ సెంటర్ వద్దే ఏడుకొండల బస్టాండ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. దీంతో ప్రధానంగా విద్యార్థులు, వికలాంగులు బస్సు పాస్‌లు తీసుకోవడం కష్టంగా మారింది. దీంతో పలువురు జిల్లా ప్రజా రవాణా అధికారికి ఎన్నోసార్లు ఈ సెంటర్ వద్ద ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. డీపీటీవోలు ఆ ప్రాంతాన్ని పరిశీలించి...వెంటనే బస్సు పాస్‌ల జారీ సెంటర్‌ను మార్చాలని అధికారులకు ఆదేశించారు. ఆదేశాలు ఇచ్చి ఏడాది గడచినా ఇప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన సమస్య ఉంటోంది. బస్సు పాస్‌లను తీసుకోవాలంటే బిక్కు బిక్కుమంటూ ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటూ విద్యార్థులు, వికలాంగులు వెళ్లాల్సిన దుస్థితి కలుగుతోంది.


బస్సు పాస్‌లు జారీ చేసే సెంటర్ వద్ద ద్విచక్రవాహనాల పార్కింగ్


బస్సు పాస్‌లు జారీ సెంటర్ వద్ద విద్యుత్ బస్సుల తాకిడి

త్వరలో చర్యలు తీసుకుంటాం



బస్సు పాస్‌ల జారీ సెంటర్‌ను మార్పు చేయాలని డీపీటీవో ఆదేశాలు ఇచ్చారు. తద్వారా అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అదేచోట విద్యుత్ బస్సుల చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయడం వాస్తవమే. త్వరలో విద్యార్థులకు ఇక్కట్లు లేకుండా చర్యలు తీసుకుంటాం.

-డీఆర్ నాయుడు, ఏటీఎం, తిరుపతి సెంట్రల్ బస్టాండ్

సంక్రాంతి విజేత పైరేట్స్ లెవెన్స్

– విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


విజేత పైరేట్స్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తుమ్మలగుంట కేవీఎస్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ టోర్నీ విజేతగా పైరేట్స్ లెవెన్స్ జట్టు నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్స్‌లో రవి కింగ్స్ జట్టుపై 44 పరుగుల తేడాతో విజయం సాధించి సంక్రాంతి కప్‌ను కైవసం చేసుకుంది. కేవీఎస్ క్రీడా మైదానం 8 జట్లు మూడు రోజులుగా సంక్రాంతి కప్ కోసం హోరాహోరీగా తలపడ్డాయి. విజేతగా నిలిచిన జట్టుకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేతుల మీదుగా రూ.10వేలు, ట్రోఫీ, రన్నర్స్ జట్టుకు రూ.5వేలు, ట్రోఫీలను ప్రదానం చేశారు. పాల్గొన్న ప్రతి క్రీడాకారుడుని ప్రత్యేకంగా అభినందించారు. టోర్నమెంట్‌ను బాధ్యత తీసుకుని విజయవంతం చేసిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.